మనం
కృష్ణా-గుంటూరు
ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల
బుధవారం - 25- ఫిబ్రవరి - 2026 పేజీలు-5

## జల్ జీవన్ మిషన్ పనులపై ప్రత్యేక దృష్టిపెట్టండి




**ఎన్‌టీఆర్ జిల్లా, ఫిబ్రవరి 24, 2026 :** జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పనులపై ప్రత్యేక దృష్టిపెట్టి త్వరితగతిన పూర్తయ్యేలా చూసి పథకం ఫలాలు ప్రజలకు చేరువయ్యేలా కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లా జల, పారిశుద్ధ్య మిషన్ (డీడబ్ల్యూఎస్ఎం) సమావేశం జరిగింది.

వివరాలు 2 లో..





## ఉత్సాహభరితంగా ప్రారంభమైన ఏపీ

# లెజిస్లేచర్స్ స్పోర్ట్స్ మీట్

**ఐక్యతకు వేదికగా లెజిస్లేచర్స్ క్రీడలు**

**శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు**

**శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు**

**విజయవాడ స్పోర్ట్స్ ఫిబ్రవరి 24 (మనం న్యూస్)** నిత్యం ప్రజల మధ్య ఉండే ప్రజా ప్రతినిధులకు క్రీడలు ఒక ఆటవిడుపుగా ఉంటూ మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయని. శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ శాసన వ్యవస్థ ఆటవిడుపు లో భాగంగా మూడురోజులపాటు నిర్వహించే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్రీడా ఉత్సవాలు-2026 ను మంగళవారం ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు లు, జ్యోతి ప్రజ్వలన, స్పోర్ట్స్ ఫ్లాగ్, నేషనల్ ఫ్లాగ్, అసెంబ్లీ ఫ్లాగ్ ల ఆవిష్కరణలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. ఈ వేదిక కేవలం క్రీడాకారుల కోసం ఏర్పాటు చేయబడిందని, ఇందులో ఎటువంటి రాజకీయాలకు తావులేదని ఆయన స్పష్టం చేశారు. ప్రజా ప్రతినిధులు నిత్యం ప్రజలు, పనులు, అసెంబ్లీ సమావేశాలతో ఒత్తిడి (టెన్షన్) ఉంటుందని, అటువంటి వారికి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు మంచి ఉపశమనాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. 1983లో దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ప్రజా ప్రతినిధులు కోసం క్రీడా పోటీలను ప్రారంభించారని, ఆ సంప్రదాయాన్ని

వివరాలు 2 లో..




## భక్తి వైభవం, వైదిక ఘనతలతో కుంభాభిషేకం

- మార్చి 6 నుంచి 8వ తేదీ వరకు ప్రత్యేక ఆధ్యాత్మిక మహోత్సవం
- 12 ఏళ్లకోసారి జరిగే కుంభాభిషేకం నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు
- దేశ విదేశాల నుంచి లక్షలాది భక్తులు వస్తారని అంచనా
- ఎక్కడా ఎలాంటి ఇబ్బంది ఎదురుకాకుండా సౌకర్యాలు
- విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కలెక్టర్ లక్ష్మీశ

## శ్రీ కనకదుర్గమును దర్శించుకున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ కుటుంబ సభ్యులు

**విజయవాడ ఇంద్రకీలాద్రి ఫిబ్రవరి 24 (మనం న్యూస్) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ కుటుంబ సమేతంగా ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనక దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ఘనస్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం: సి.ఎస్. విజయానంద్ దంపతులు ఇంద్రకీలాద్రికి చేరుకుని, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలు: ఆలయ కార్య నిర్వహణాధికారి (EO) వి.కె. శీనా నాయక్ సి.ఎస్. కుటుంబానికి స్వాగతం పలికి, ఆలయ మర్యాదలతో దర్శన ఏర్పాట్లు చేశారు. ఆశీర్వచనం: దర్శనం అనంతరం వేద పండితులు వారికి ఆశీర్వచనం అందజేయగా, ఈఓ శీనా నాయక్ అమ్మవారి శేష వస్త్రం, చిత్రపటం మరియు ప్రసాదాన్ని అందజేశారు. భక్తులకు



కల్పిస్తున్న సౌకర్యాల గురించి సి.ఎస్. అడిగి తెలుసుకున్నారు. ఈఓ శీనా నాయక్ ఆలయ అభివృద్ధి పనులు మరియు భక్తుల సౌకర్యార్థం తీసుకుంటున్న చర్యలను వివరించారు.

## పన్నుల వసూలుపై అధికారులతో సమన్వయ సమావేశం



మచిలీపట్నం ఫిబ్రవరి 24 (మనం న్యూస్) మంగళవారం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో వాణిజ్య పన్నుల వసూలు పై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలో ఆస్తులు, భూముల క్రయవిక్రయాలు జరిగినప్పుడు అందుకు సంబంధించిన వివరాలను వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు అందజేయాలన్నారు.

వివరాలు 2 లో..

# జల్ జీవన్ మిషన్ పనులపై ప్రత్యేక దృష్టిపెట్టండి

**త్వరితగతిన పూర్తయ్యేలా కృషిచేయండి**

**తాగునీటి నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ అవసరం**

**వేసవి సన్నద్ధత పకడ్బందీగా ఉండాలి... జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**మొదటి పేజీ తరువాయి**

ఈ సమావేశంలో జల్ జీవన్ మిషన్ – కుళాయి కనెక్షన్లలో పురోగతితో పాటు పథకం పనితీరుపై సమీక్షించారు. అదేవిధంగా స్వచ్ఛభారత్ మిషన్ (గ్రామీణ్)– ఓడీఎఫ్ ప్లస్, ఘన ద్రవ వ్యర్థాల నిర్వహణ, నీటి నాణ్యత పర్యవేక్షణ, నిధూ తదితరాలపై చర్చించారు. ఎ.కొండూరులో మండలంలోని సీకేడీ ప్రభావిత ప్రాంతాల్లో ఇంటి కుళాయి కనెక్షన్ల భౌతిక స్థితిని పరిశీలించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. 100 శాతం కనెక్షన్లు కల్పించేందుకు డీపీవోకు ఆదేశాలిచ్చారు. గొల్లమండల తండా, జమలగడ్డ, దీప్లానగర్ ఆవాసాలకు అవసరమైన క్లియర్ వాటర్ సంప్ నిర్మాణం పూర్తిచేసి మార్చి నాటికి తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. వేసవిలో ఎక్కడా తాగునీటికి కొరత లేకుండా పకడ్బందీ ప్రణాళికలు అమలు చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. నిరంతర నాణ్యమైన తాగునీటి సరఫరా జరిగేలా చూడాలన్నారు. షెడ్యూల్ ప్రకారం చేతి పంపులు, బోర్‌వెల్స్ మరమ్మతులు, పైపులైన్ల లీకేజీల నివారణ, కలుషిత నివారణ వంటి వాటి పనులు జరిగేలా చూడాలన్నారు. ఆరోగ్యం, విద్య, మహిళా ౘ శిశు సంక్షేమ శాఖలతో సమన్వయం చేసుకుంటూ జిల్లాలో తాగునీటి సరఫరా వ్యవస్థలో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. స్వర్ణాంధ్ర ఏ 2047 లక్ష్యాల సాధనలో స్వచ్ఛమైన తాగునీటి సరఫరా కూడా కీలక అంశమని.. ఈ నేపథ్యంలో నీటి నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థను పకడ్బందీగా అమలుచేయాలని స్పష్టం చేశారు. మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్దిష్ట కాలపరిమితుల్లో నీటి వనరుల శాంపిళ్లను పరీక్షించి, ఫలితాలను ఆన్‌లైన్లో నమోదు చేయాలన్నారు. పీహెచ్, టీడీఎస్, హార్డ్‌నెస్, ఫ్లోరైడ్, ఐరన్, నైట్రేట్ వంటి వాటితో పాటు భౌతిక, రసాయన, బ్యాక్టీరియాలజికల్ పరామితులపై దృష్టిసారించాలన్నారు. క్లోరినేషన్‌తో పాటు పాఠశాలలు, అంగన్వాడీలు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, హాస్టళ్లు వంటి వాటిలో ట్యాంకుల శుద్ధి సరైన విధంగా జరిగేలా సమన్వయ శాఖల అధికారుల పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. సమావేశంలో జెడ్‌పీ సీఈవో కె.కన్నమనాయుడు, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఎ.రామకృష్ణారావు, డీపీవో పి.లావణ్యకుమారి, డ్వామా పీడీ ఎ.రాము, వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, విద్య, వైద్యం, ఐసీడీఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దుర్గమ్మను దర్శించుకున్న దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ ఎం హరి జవహర్ లాల్ కుటుంబ సభ్యులు



**విజయవాడ ఇంద్రకీలాద్రి ఫిబ్రవరి 24 (మనం న్యూస్)** : ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానాన్ని. రాష్ట్ర దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ ఎం. హరి జవహర్ లాల్ తన కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం, ఆయన దంపతులు ఆలయంలో నిర్వహించిన శ్రీ అమ్మవారి ఖడ్గమాలార్చన పూజలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి వేద ఆశీర్వచనం అందించి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

## డ్రగ్స్‌పై దండ యాత్ర - డ్రగ్స్ రహిత సమాజం ప్రతి ఒక్కరి బాధ్యత

**నందిగామ,ఫిబ్రవరి24(మనంన్యూస్) :** ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి రాజశేఖర్ బాబు డ్రగ్స్ నిర్మూలన కొరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అవగాహన ర్యాలీ ది. 25/02/2026 బుధవారం రోజు నందిగామ మండలం లోకి వస్తున్న సందర్భంగా పలువురు పోలీసు, మండల స్థాయి ప్రభుత్వ ఉన్నత అధికారులు, సామాజిక కార్యకర్తలు, రాజకీయ నాయకులు, విద్యాసంస్థలు, విద్యార్థులు, వ్యాపార వేత్తలు ప్రతి ఒక్కరూ డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ఈ ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా నందిగామ టౌన్ సిఐ నాయుడు కోరారు.




# ఉత్సాహభరితంగా ప్రారంభమైన ఏపీ లెజిస్లేచర్స్ స్పోర్ట్స్ మీట్





**మొదటి పేజీ తరువాయి**

స్ఫూర్తిగా తీసుకుని ఈ కార్యక్రమాన్ని మళ్ళీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత అసెంబ్లీలో దాదాపు 78% మంది యువ ఎమ్మెల్యేలు ఉన్నారని, వారి ఉత్సాహం ఈ పోటీలకు మరింత బలాన్ని ఇస్తుందని ఆయన అన్నారు. ఈ పోటీలు కేవలం ప్రజాప్రతినిధులకే పరిమితం కాదని, ప్రజలు కూడా వచ్చి వీక్షించి తమ ప్రతినిధులను ప్రోత్సహించాలని కోరారు. తన చిన్నతనంలో వాలీబాల్ ఆడేవాడినని, దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తన ఆటను చూసి రాజకీయాల్లోకి ఆహ్వానించిన.. తన పాత జ్ఞాపకాలను స్పీకర్ గుర్తు చేసుకున్నారు. క్రీడల ముగింపు రోజున (అసెంబ్లీ చివరి రోజు) ఎమ్మెల్యేలు తమ కుటుంబ సభ్యులతో కలిసి రావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారని, ఆ రోజు సాంస్కృతిక కార్యక్రమాలు,బహుమతి ప్రధా నోత్స వం ఉంటుందని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు మాట్లాడుతూ.. గతంలో దివంగత ఎన్.టి. రామారావు హయాంలో ప్రారం భమై, మధ్యలో నిలిచిపోయిన ఈ క్రీడా సంప్రదాయాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తిరిగి ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. రాష్ట్రంలో మరుగున పడుతున్న గ్రామీణ క్రీడలను, పాఠశాలల్లో క్రీడల ప్రాధాన్య తను మళ్ళీ ప్రజలకు గుర్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా ప్రతినిధులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా రాష్ట్ర యువత, విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి, అవగాహన పెరుగుతుందని, ఇది జిల్లా స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడాకారులను తయారు చేయడా నికి నాంది కావాలని కోరారు. శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు మాట్లాడుతూ.. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు శాసనసభ, శాసన మండలి సభ్యులకు క్రీడా పోటీలు నిర్వహి స్తున్నామన్నారు. గత ఏడాది కంటే ఈసారి పోటీలను అత్యంత ఘనంగా నిర్వహిం చాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఎనిమిది మంది సభ్యులతో కూడిన కమిటీ ఈ పోటీల ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంద న్నారు. ఆంధ్రప్రదేశ్‌ను స్పోర్ట్స్ హబ్‌గా మార్చాలనే ముఖ్య మంత్రి ఆకాంక్షకు అనుగుణంగా శాప్ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నా మన్నారు. ముందుగా స్పీకర్ అయ్యన్న పాత్రుడుతో కలిసి ప్రజాప్రతినిధులు అందరూ అధికారికంగా క్రీడా జ్యోతి ని వెలిగించి క్రీడలను ప్రారంభించారు. శాసనవ్యవస్థ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్, డిప్యూటీ స్పీకర్ కే. రఘురామ కృష్ణం రాజు, ప్రభుత్వ విప్ లు జీవీ ఆంజనేయులు, పి. అనురాధ, శాప్ వీసీ మరియు ఎండీ ఎస్. భరణి ఇతర అధికారులు తెలియజేశారు.

## జగ్గయ్యపేట లో స్వచ్ఛ రథాలను ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)

**జగ్గయ్యపేట ఫిబ్రవరి 24 మనం న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ రథం కార్యక్రమంలో భాగంగా మంగళవారంజగ్గయ్యపేట పట్టణంలోని బంగారు కొట్ల సెంటర్ లో వినాయకుడి గుడి వద్ద అధికారులతో కలిసి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) స్వచ్ఛ రథం (వాహనం) ను రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజ గోపాల్ తాతయ్య మాట్లాడుతూ గ్రామా లను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతో పాటు వ్యర్ధాలకు విలువ కల్పించి ప్రజలకు ఆర్థిక వెసులుబాటు కల్పించాలనే ఉద్దేశంతో కూటమి




ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛ రథం కార్యక్రమం చేపట్టిందని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పేర్కొన్నారు.

ఇంటింటికి వచ్చే స్వచ్ఛ రథం వాహనానికి పనికిరాని ప్లాస్టిక్ వస్తువులు, బాటిళ్లు, కవర్లు, ప్యాకెట్లు, గాజు సీసాలు, పేపర్లు, పుస్తకాలు, అట్టపెట్టెలు, నూనె డబ్బాలు, ఇనుము, స్టీల్, అల్యూమినియం వ్యర్థాలను ఇస్తే వాటిని తూకం వేస్తారని తెలిపారు. ఆ వ్యర్థాల విలువకు సమానమైన నగదును లెక్కించి..... దానికి బదులుగా సబ్బులు టూత్ పేస్టులు ఉల్లిపాయలు వంటి సుమారు 20 రకాల నిత్యావసర సరుకులు అక్కడికక్కడే అందజేస్తారని వెల్లడించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టుగా ఈ కార్యక్రమం విజయం సాధించింది అన్నారు. ప్రజల నుంచి విశేష స్పందన రావడంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా దీనిని అమలు చేస్తున్నామని తెలిపారు. స్వచ్ఛ రథం – స్వచ్ఛ సంకల్పం కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎంపీడీవో జి. నితిన్ , సొసైటీ చైర్మన్ ధూళిపాళ్ల లక్ష్మణరావు, కౌన్సిలర్లు ఇర్రి నరసింహారావు, గొట్టే నాగరాజు , ఈ ఓ షేక్ ఖాసిం మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సమన్వయ సమావేశం

**మొదటి పేజీ తరువాయి**

తప్పనిసరిగా వస్తు సేవల పన్నులు వసూలు అయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత వ్యక్తులకు సంబంధించి బ్యాంకు వివరాలను కూడా వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు అందజేయాలన్నారు. పట్టణాలలో గాని గ్రామ పంచాయితీలలో గాని ప్రభుత్వం చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్టర్ లు తప్పనిసరిగా వస్తు సేవల పన్ను చెల్లించాల్సి ఉంటుందని అటువంటి వివరాలను వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు అందజేయాలన్నారు. అలాగే పౌర సరఫరాలు, తూనికలు కొలతలు, గనులు భూగర్భ శాఖల అధికారులు టాస్క్ ఫోర్స్ ఏర్పాటై ఉమ్మడిగా వాహనాలను తనిఖీ చేసి వస్తు సేవల పన్ను వసూలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో కూడా వృత్తి పన్ను వసూలు చేస్తున్నారా లేదా విచారించి అందుకు సంబంధించిన వివరాలను వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో వాణిజ్య పన్నుల శాఖ సంయుక్త కమిషనర్ జి కల్పన, అదనపు ఎస్పీ వి నాయుడు, వాణిజ్య పనుల శాఖ సహాయ కమిషనర్లు సౌమ్య, జగదీష్, రాజకుమార్, డిపిఓ డాక్టర్ జె అరుణ, డిఎస్ఓ మోహన్ బాబు జెడ్పి డిప్యూటీ సీఎం సిఈఓ ఆనంద్ కుమార్ జిల్లా ఆడిట్ అధికారి సూర్య ప్రకాష్ రావు జిల్లా రిజిస్ట్రార్ గోపాలకృష్ణ గనులు భూగర్భ శాఖ ఏజీ కొండారెడ్డి మచిలీపట్నం తాడిగడప ఉయ్యూరు మునిసిపల్ కమిషనర్లు బాపిరాజు, నజీర్, రామారావు వాణిజ్య పన్నుల శాఖ డి ఏ సి చంద్రశేఖర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## తిరువూరు ఏరియా ఆసుపత్రికి “గ్రహణం”

### గర్భిణీల కష్టాలపై ఏ ఐ వై ఎఫ్ నేత లంకా గోవిందరాజులు ఆరోపణలు

**విజయవాడ సెంట్రల్ ఫిబ్రవరి 24( మనం న్యూస్)** వైద్యం అందక పేదల ప్రాణాలతో చెలగాటమా? అధికారుల నిర్లక్ష్యంపై లంకా గోవిందరాజులు యుద్ధ ప్రకటన “ప్రభుత్వ వైద్యం ముద్దు – ప్రైవేట్ వైద్యం వద్దు” అనే నినాదాలు కేవలం గోడలకే పరిమితమయ్యాయని, క్షేత్రస్థాయిలో తిరువూరు ఏరియా ఆసుపత్రి పరిస్థితి చూస్తుంటే సామాన్యుడి గుండె తరుక్కుపోతోందని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లంకా గోవిందరాజులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం దాసరి భవన్‌లోని ఏఐవైఎఫ్ కార్యాలయంలో జరిగిన పత్రికా ప్రకటన ద్వారా ఆయన ఆసుపత్రి దుస్థితిపై అధికారుల తీరును ఎండగట్టారు. ఈ సందర్భంగా గోవింద రాజులు మాట్లాడుతూ గైనకాలజిస్ట్ లేని ఆసుపత్రి కార్పొరేట్లకు కాసులు. మెట్ట ప్రాంత గర్భిణీలకు కొండంత అండగా ఉండాల్సిన ఏరియా ఆసుపత్రిలో ఒక్క మహిళా వైద్యురాలు (గైనకాలజిస్ట్) లేకపోవడం సిగ్గుచేటు. ఐసీడీఎస్ లెక్కల ప్రకారం 90 శాతం ప్రసవాలు ప్రైవేట్ ఆసుపత్రుల్లోనే జరగడం అధికారుల వైఫల్యానికి సజీవ సాక్ష్యం. 270 మంది గర్భిణీలు నేడు వేలాది రూపాయలు అప్పులు చేసి కార్పొరేట్ గడప తొక్కుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బంది కొరత పేరుతో పారిశుద్ధ్య కార్మికులతో ఓపీ చీటీలు రాయించడం ఏంటని ఆయన అధికారులను నిలదీశారు. రోగుల ఆరోగ్యంతో అధికారులు జూదం ఆడుతున్నారా అని ప్రశ్నించారు. మూలపడ్డ ఈసీజీ, ఎక్స్–రే మిషన్లు: కోట్లాది రూపాయల నిధులు ఎటు వెళ్తున్నాయని, ఆసుపత్రిలో కనీస పరీక్షా యంత్రాలు కూడా పని చేయకపోవడం వల్ల పేదలు బయట ల్యాబ్‌లలో దోపిడీకి గురవుతున్నారని ధ్వజమెత్తారు. జిల్లా కలెక్టర్ మరియు వైద్య శాఖ ఉన్నతాధికారులు ఏసీ గదుల్లో కూర్చోవడం మానేసి, ఒక్కసారి తిరువూరు ఏరియా ఆసుపత్రిని సందర్శించండి. ఇక్కడ రోగులు పడుతున్న నరకం మీకు కనిపిస్తుంది” అని గోవిందరాజులు హెచ్చరించారు.



యుద్ధ ప్రాతిపదికన ఏరియా ఆసుపత్రికి పూర్తిస్థాయి గైనకాలజిస్ట్‌ను నియమించాలి. పని చేయని వైద్య పరికరాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలి. లేనిపక్షంలో తిరువూరు ప్రాంత ప్రజలను ఏకం చేసి ఆసుపత్రి ముట్టడితో పాటు పెద్ద ఎత్తున ప్రజా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# లూజ్‌మిల్క్ అమ్ముతున్నటువంటి వివిధ అవుట్ లెట్స్‌పై అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ దాడులు



**విజయవాడ తూర్పు ఫిబ్రవరి 24 ( మనం న్యూస్) :** విజయవాడలోని కృష్ణలంక, పంటకాలువ రోడ్డు, కరెన్సీ నగర్, ప్రసాదంపాడు, గురునానక్ కాలనీ తదితర ప్రాంతల్లో తనిఖీలు చేశారు. ఔట్లెట్స్ నుండి 7 శాంపిల్స్ ని సేకరించటం జరిగింది. ఈ శాంపుల్స్ ని పాల నాణ్యత నిర్ధారణ కొరకు హైదరాబాదులోని విమ్టా ప్రయోగశాలకు పంపించడం జరుగుతుంది. ఈ రెయిడ్స్ నిరంతరంగా జిల్లాలో కొనసాగుతూనే ఉంటాయి. పాలలో జరిగే వివిధ కల్తీలకు సంబంధించి కొన్ని చిట్కాలను పాటించవలసిందిగా వినియోగదారులకు సూచిస్తున్నాం పాలు బాగా చిక్కగా ఉండటానికి పాలలో పిండిని కలపటానికి అవకాశం ఉన్నది.

దీనిని తెలుసుకొనుటకుగాను కొద్దిగా పాల శాంపుల్ తీసుకొని దీనిలో రెండు చుక్కలు అయోడిన్ ని వేసినట్లయితే పాలు నీలి రంగు లోకి మారుతాయి. పాలల్లో అధిక వెన్న శాతం కొరకు వెజిటబుల్ నూనెలను కలుపుతారు. పాలు జిడ్డుగా ఉన్నట్లయితే దీనిని అనుమానించవచ్చు. పాలు చేదుగా ఉన్నా, దుర్గంధం తో ఉన్నా అటువంటి పాలను వినియోగించరాదు. స్వచ్ఛమైన పాలు త్వరగా చెడిపోతాయి. పాలు ఎక్కువసేపు చెడిపోకుండా నిల్వ ఉన్నాయంటే వాటిలో హైడ్రోజన్ పెరాక్సైడ్ వంటి కెమికల్స్ ని వాడినట్లుగా అనుమానించాలి.

పాల కల్తీపై మీకు అనుమానం ఉన్నట్లయితే ఫుడ్ సేఫ్టీ వారికి కానీ, పశుసంవర్ధక శాఖ వారికి కానీ తెలియపరచినట్లయితే ఆ పాల శాంపిల్స్ సేకరించి, కల్తీ పాలుగా తేలినట్లయితే నిర్ధారణ అయినట్లయితే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబడును. పాలను ప్లాస్టిక్ లేదా అల్యూమినియం క్యాన్లలో రవాణా చేయరాదు. కేవలం స్టెయిన్లెస్ స్టీల్ క్యాన్లలో మాత్రమే రవాణా చేయాలి. లూజ్ పాలు అమ్మే వారు పరిసరాల పరిశుభ్రత పాటించాలి.

# ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం, ట్రాఫిక్ డీసీపీ, షరీనా బేగం

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి, 24, (మనం న్యూస్) :** ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు, ఐపీఎస్, అదేశాలు మేరకు ట్రాఫిక్ డీసీపీ షరీనా బేగం, ఐపీఎస్, అదనపు డీసీపీ గుణ్ణం రామకృష్ణ, పర్యవేక్షణలో ట్రాఫిక్ మరియు లా అండ్ ఆర్డర్ పోలీసుల ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, రాంగ్ రూట్లో వచ్చే ద్విచక్ర వాహనదారులకు తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి ట్రాఫిక్ డీసీపీ షరీనా బేగం మాట్లాడుతూ నేషనల్ హైవే పై ప్రమాదాలు ఎక్కువ గా జరుగుతున్నాయి అది దృష్టిలో పెట్టుకుని రూల్స్ ను అధిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే డైరెక్ట్ గా జైలుకే పంపిస్తాం లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దు హెల్మెట్ లేకుండా వాహనాలు నడపొద్దు రాంగ్ గ్రూట్లో వాహనాలు నడిపితే వాహనాలను సీజ్ చేస్తాం వారిపై కఠిన చర్యలు తీసు కుంటామని ద్విచక్ర వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. లైసెన్స్ లేని వాహనాలను పర్మినెంట్గా సీజ్ చేయడమే కాకుండా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గుణ్ణం రామకృష్ణ అన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక దృష్టి సారించి, బ్రెత్ అనలైజర్ పరీక్షలు చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి, వాహనాలను స్వాధీనం



చేసుకున్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు మరియు ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం చట్టరీత్యా నేరమని, కఠిన చర్యలు తీసుకుంటామని ద్విచక్ర వాహనదారులకు స్థానిక పోలీస్ స్టేషన్లో కౌన్సిలింగ్ ఇస్తూ హెచ్చరించారు. ప్రజలు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్, ఆర్ ఐ, కొక్కిరిగడ్డ కృష్ణ, ఆర్ ఎస్ ఐ, లక్ష్మణ్, లా అండ్ ఆర్డర్, ఎస్సైలు, ట్రాఫిక్, సిబ్బంది. పాల్గొన్నారు.

# జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం చేయండి

**జిల్లా జనసేన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ సభ్యత్వ నమోదు సమన్వయకర్త శ్రీ బొమ్మిడి నాయకర్ గారు. ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ సామినేని ఉదయభాను గారు.**





**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 24 (మనం న్యూస్):** జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం చేయండనీ విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ సభ్యత్వ నమోదు సమన్వయకర్త బొమ్మిడి నాయకర్ , ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను పిలుపునిచ్చారు. మంగళవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ క్రియాశీలకు సభ్యత్వ నమోదుపై ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నాయకులతో కలిసి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జనసేన పార్టీ ఐటీ వింగ్ ప్రతినిధులతో క్షేత్రస్థాయిలో జనసైనికులు పార్టీ క్రియాశీలక సభ్యత్వాలు ఏ విధంగా నమోదు చేయాలి అనే అంశంపై అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ 2026 వ సంవత్సరం జనసేన పార్టీ బలోపేతం కోసం పనిచేసేవారిని ఉద్యమి, సాదక్, ప్రదాతలుగా వర్గీకరించినట్లు వెల్లడించారు. పవన్ కళ్యాణ్ పార్టీ తొలి సభ్యత్వం తీసుకొని రెండు కోట్ల రూపాయలు కార్యకర్తల కోసం విరాళం ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఉద్యమి సభ్యత్వ నమోదు రుసుము 400 రూపాయలుగా నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీఆర్ జిల్లాలో కూడా ఈ నెల 26వ తేదీ నుండి సభ్యత్వ నమోదు కార్యక్రమం పండుగ వాతావరణం లో జనసైనికులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. నూతనంగా పార్టీలో చేరిన వారితో పార్టీ క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం అవుతుందన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి 75 నుండి 100 మంది సాధకులను నియమించామని పేర్కొన్నారు. ఉద్యమి సభ్యత్వం తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. పక్కా ప్రణాళికతో జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎన్టీఆర్ జిల్లాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్క జన సైనికుడు వీర మహిళలు బాధ్యతగా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ రాష్ట్ర డైరెక్టర్ మండలి రాజేష్ , జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మైలవరం జనసేన పార్టీ ఇంచార్జ్ అక్కల గాంధీ , విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్చార్జ్ అమ్మిశెట్టి వాసు , నందిగామ జనసేన పార్టీ సమన్వయకర్త తంబలపల్లి రమాదేవి , తిరువూరు నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త మనుబోలు శ్రీనివాస రావు , విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త బొల్లిశెట్టి వంశీ కృష్ణ జగ్గయ్యపేట నియోజకవర్గం సమన్వయకర్త బాడిశ మురళీ కృష్ణ , రాష్ట్ర పీఏసీ సహాయ కార్యదర్శి పోతిరెడ్డి అనిత , విజయవాడ జనసేన కార్పొరేటర్లు మహాదేవ అప్పాజీ , మరుపిళ్ల రాజేష్ , ఉమ్మడి కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు బొలియే శెట్టి శ్రీకాంత్ . కృష్ణ పెన్నా రీజియన్ కో ఆర్డినేటర్లు రావి సౌజన్య , మల్లెపు విజయలక్ష్మి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు వీర మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సుజనా చౌదరి కార్యాలయంలో ఎల్వోసీ పత్రాలు అందచేత

**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 24 (మనం న్యూస్):** పశ్చిమ నియోజకవర్గంలోని 46 వ డివిజన్ కు చెందిన తటవర్తి కుమార్ మెదడు నరాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు.. అతనికి మెరుగైన వైద్యం కోసం 5,50,000/- రూపాయల ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు.. ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ ను సంప్రదించారు.. సమస్యను ఎమ్మెల్యే సుజనా దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ కోసం లేఖ రాసారు . దానికి సంబంధించిన ఎల్వోసీ పత్రాన్ని బాధితుడి కుటుంబ సభ్యులకు అంద చేశారు.. భవానీపురం 41 వ డివిజన్ కు చెందిన షేక్ సల్మా డిస్క్ కు సంబంధించిన వ్యాధితో బాధ పడుతోంది.. ఆమెకు మెరుగైన వైద్యం కోసం 3,25,000/బి రూపాయల ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు.. ఆర్థికంగా స్తోమత లేకపోవడంతో ఎమ్మెల్యే కార్యాలయాన్ని సంప్రదించారు.. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆమెకు సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం కోసం లేఖ రాసారు.. దీనికి సంబంధించిన ఎల్వోసీ పత్రాన్ని రోగి కుటుంబ సభ్యులకు అంద చేశారు.. ఈ సందర్భంగా బాధితుల కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే సుజనా చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు.. కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, బిజెపి నాయకుడు అవ్వారు శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు మహేష్, పోతిన రాము , సుజనా మిత్ర లు పాల్గొన్నారు.



# ఆపన్నులకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి ఎమ్మెల్యే బోడె ప్రసాద్

**ఉయ్యూరు ఫిబ్రవరి 24 (మనం న్యూస్) :** ఆపదలో ఉన్నవారికి ముఖ్యమంత్రి సహా యనిధి ఎంతగానో తోడ్పాటునిస్తుందని శాసనసభ్యులు బోడె ప్రసాద్ అన్నారు. పెనమలూరు నియోజకవర్గం, ఉయ్యూరు మండలం ఉయ్యూరు గ్రామానికి చెందిన ఆరేపల్లి నవీన్ తల్లిదండ్రులు కోల్పోవడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ఐదు లక్షల చెక్కును రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాల యంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, కృష్ణా జిల్లా టిడిపి అధ్యక్షులు వీరంకి గురుమూర్తి అందజేశారు. నియోజకవర్గానికి ముఖ్య మంత్రి సహాయ నిధులు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గానికి 13 కోట్లు ముఖ్యమంత్రి సహాయ నిధులు తీసుకు రావడంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కృషి అభినందనీయమని గురుమూర్తి అన్నారు.



# యల్.బి.ఆర్.సి.ఈ లో కెరీర్ గైడెన్స్ పై అవగాహనా సదస్సు

**మైలవరం ఫిబ్రవరి 24 మనం న్యూస్:** స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఎస్. వెంకట రత్నం, ఎన్ ఎస్ ఎఫ్ కో ఆర్డినేటర్, లయన్స్ క్లబ్ విజయవాడ డైమండ్స్ వారి ఆధ్వర్యంలో బి. టెక్ సెకండ్ ఇయర్ విద్యార్థిని , విద్యార్థులకు "కెరీర్ గైడెన్స్" అనే అంశం పై అవగాహనా సదస్సును నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ఎమ్. సాంబశివరావు, మేనేజింగ్ డైరెక్టర్, మైక్రో లింక్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీస్ మేకా శ్రీలత యు ఎస్ ఏ ఎన్ ఎస్ ఎఫ్ విజయవాడ చాప్టర్ రిసోర్స్ పర్సన్స్ గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎమ్. సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు ఇంజనీరింగ్ లో మీకు నచ్చిన కోర్సులను ఎంచుకోని, చదివింది గుర్తు పెట్టుకోవడం కోసం ఎలాంటి పద్ధతులను పాటించాలో తెలిపారు. మేకా శ్రీలత మాట్లాడుతూ చదువుతో పాటు సాఫ్ట్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్, మరియు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవడం చాలా ముఖ్యమని, డిజిటల్ మార్కెటింగ్, సెరీకల్చర్, యానిమేషన్ వంటి కోర్సులు ద్వారా ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో లకిరెడ్డి బాలిరెడ్డి ఛారిటబుల్ ట్రస్టీ లకిరెడ్డి పసంద్ కుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ బి రమేష్ రెడ్డి, కళాశాల ఎన్ ఎస్ ఎఫ్ కో ఆర్డినేటర్ జి. నాగిరెడ్డి విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



# చిల్లకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రగ్స్‌పై దండయాత్ర సైకిల్ ర్యాలీ



**జగ్గయ్యపేట ఫిబ్రవరి 24 మనం న్యూస్ :** డ్రగ్స్ పై దండయాత్ర సైకిల్ ర్యాలీ మంగళవారం చిల్లకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో సాగింది. డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపాలనే సదుద్దేశంతో పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఐ.పి.ఎస్., నేతృత్వంలో అడ్మిన్ డి.సి.పి. కె.జి.వి.సరిత ఐ.పి.ఎస్.స్వీయ పర్యవేక్షణలో డ్రగ్స్ పై దండయాత్ర అనే నినాదంతో 34 రోజులపాటు 510 కిలోమీట ర్ల సైకిల్ యాత్రలో లో బాగంగా 29వ రోజు ఈ సైకిల్ యాత్ర కార్యక్రమం చిల్లకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో సాగింది. మంగళవారం డ్రగ్స్ పై దండయాత్ర 29వ రోజు 16 కిలోమీటర్ల మేర సాగింది. ఇప్పటి వరకు ఈ యాత్ర 428 కిలోమీటర్లకు చేరుకుంది. ఈ కార్యక్రమం రూరల్ డి.సి.పి. బి లక్ష్మి నారాయణ ఐ.పి.ఎస్., నందిగామ ఇన్ ఛార్జ్ ఏ.సి.పి. లతాకుమారి పర్యవేక్షణలో జగ్గయ్యపేట ఇన్స్పెక్టర్ పి.వెంకటేశ్వర్లు , చిల్లకల్లు ఎస్.ఐ. టి.సూర్య శ్రీనివాస్ వారి సిబ్బందితో ఘనంగా ఏర్పాట్లు చేశారు. షేర్ మహమ్మద్ పేట నుండి ప్రారంభమైన సైకిల్ యాత్రలో డ్రగ్స్ వద్దు జీవితం ముద్దు అనే నినాదంతో అలుపనేది లేకుండా షేర్ మహమ్మద్ పేట, గౌరవరం గ్రామాలలో అత్యంత వైభవంగా ర్యాలీ సాగింది

మత్తు రహిత సమాజం లక్ష్యంగా సాగుతున్న ఈ సైకిల్ యాత్రలో హృదయాలను కదిలించిన ఓ భావోద్వేగ క్షణం చోటుచేసుకుంది. గ్రామంలో ఓ పెద్దావిడ ధైర్యంగా ముందుకు వచ్చి, నా ప్రాణం పోయినా పర్వాలేదు... డ్రగ్స్ గురించి పోలీసులకు నేనే సమాచారం ఇస్తాను"అంటూ గట్టి గొంతుతో తన సంకల్పాన్ని వెల్లడించింది. ఆమె మాటలు అక్కడ ఉన్న ప్రతి ఒక్కరికి బాధ్యతను గుర్తు చేస్తూ యాత్రకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చాయి. డ్రగ్స్ అనే మత్తు ఎంతటి కుటుంబాలనైనా నిశ్శబ్దంగా నాశనం చేస్తుందో కూలి పనులు చేసుకుంటున్న మహిళలు ఈ యాత్రను చూసి భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ "మా కుటుంబంలో జరిగిన నష్టం ఇంకో ఇంట్లో జరగకూడదు... మా కన్నీళ్లు ఇంకెవరూ కార్చకూడదు" అంటూ కన్నీటి కళ్లతో వారు తెలిపిన మాటలు అక్కడ ఉన్న ప్రతి ఒక్కరి మనసును కదిలించాయి. స్వార్థం లేకుండా సమాజం కోసం ముందుకు వచ్చిన మహిళా అధికారులకు వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ సందర్భంగా అధికారులు డ్రగ్స్ పై ఎటువంటి సమాచారాన్ని అయిన 112 కు గాని 1972 కి గాని తెలియజేయాలని, అదేవిధంగా ప్రతి ఒక్కరూ https://events.ntrpolice.in/ లాగిన్ అయ్యి రిజిస్టర్ అవ్వలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, సుమారు 1200 మంది వరకు అధ్యాపకులు, విద్యార్థులు, పెద్ద ఎత్తున స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## ప్రజలందరికీ తారతమ్యాలు లేకుండా సమాన న్యాయం జరిగేలా చూడడమే జాతీయ నేషనల్ లోక్ అదాలత్ లక్ష్యం

**నందిగామ మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ కమ్ 16వ అదనపు జిల్లా కోర్టు జడ్జి పి. శ్రీనివాసరావు.**



**నందిగామ, ఫిబ్రవరి24 (మనంన్యూస్):** న్యాయ సేవలు ప్రజలందరికీ ఎటువంటి తారతమ్యాలు లేకుండా కక్షిదారులందరు సమానమైన న్యాయం జరగాలని ఉద్దేశంతో ఏర్పాటుచేసిన జాతీయ నేషనల్ లోక్ అదాలత్ లను అందరూ వినియోగించుకోవాలని అప్పుడే న్యాయ వ్యవస్థ పై నమ్మకం, విశ్వాసం కలుగుతుందని అని నందిగామ మండల సర్వీస్ కమిటీ చైర్మన్ మరియు 16వ అదనపు జిల్లా కోర్టుజడ్జి పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ది:14/03/2026 తేదీ జరిగే జాతీయ లోక్ అదాలత్ లో నందిగామ మండల లీగల్ సర్వీస్ కమిటీ పరిధిలో ఉన్న నాలుగు మండలాల్లో ఉన్న కక్షిదారులు 4 కోర్టు పరిధిలోని కేసులలో రాజీ పడదగినకేసులు అనగా మోటారు వాహన ప్రమాద బీమాలు, భూ తగాదాలు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకులకు సంబంధించిన కేసులు, రాజీ పడదగిన ఇరు వర్గాల కక్షిదారులకు క్రిమినల్ కేసులు, భార్య భర్తలకు సంబంధించిన కేసులు మొదలైన కేసులను రాజీ చేసుకోవచ్చని, రాజీమార్గమే రాజమార్గమని దీనివలన కక్షిదారులకు సమయం, డబ్బు, ఇరు వర్గాల మధ్య స్నేహపూర్వకమైన వాతావరణ నెలకొంటుందని, అందరూ సోదరీ భావంతో కలిసి ఉండవచ్చునని, నందిగామ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, 16వ అదనపు జిల్లా జడ్జి పి. శ్రీనివాసరావు తెలిపారు.

## టైర్ల మార్కెట్‌లోకి బాలకృష్ణ ఇండస్ట్రీస్ లిమిటెడ్

**గాంధీనగర్ ఫిబ్రవరి 24 మనం న్యూస్:** ఆఫ్ హైవే టైర్ విభాగంలో ప్రపంచ అగ్రగామి అయిన బాలకృష్ణ ఇండస్ట్రీస్ లిమిటెడ్, తన ఆన్ హైవే పోర్ట్‌ఫోలియోను అందుబాటులోకి తీసుకువచ్చి భారతదేశ వినియోగదారుల టైర్ల మార్కెట్‌లోమైలురాయిగా నిలిచే తన ప్రవేశాన్ని ప్రకటించింది. దాని ఆఫ్ హైవే టైర్ నాయకత్వానికి ఆవల వ్యూహాత్మక విస్తరణను సూచిస్తూ, బాలకృష్ణ ఇండస్ట్రీస్ లిమిటెడ్ టూ వీలర్లు, మీడియం, హెవీ వాణిజ్య వాహనాలు కోసం పర్పస్ బిల్ట్ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇది భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న వినియోగదారు, భర్తీ టైర్ విభాగాలకు దాని దీర్ఘకాలిక నిబద్ధతను నొక్కిచెబుతుంది. ఇదే సమయంలో కంపెనీ 'ఎలివేట్ యువర్ డ్రైవ్' అనే జాతీయ బ్రాండ్ ప్రచారాన్ని ప్రారంభించింది. దీనిలో బ్రాండ్ ప్రచారకర్త రణవీర్ సింగ్‌తో కలిసి తన వినియోగదారుల వద్దకు బ్రాండ్ ప్రయాణాన్ని తీసుకువెళుతూ, స్వదేశీ ప్రపంచ టైర్ తయారీదారుకు కొత్త అధ్యాయాన్ని సూచిస్తుంది.




## సహకార ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలి : సిఐటియు

**ముసునూరు ఫిబ్రవరి 24 (మనం న్యూస్)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్స్ ఐక్యకార్యాచరణ జేఏసీ . ముసునూరు మండల కమిటీ ఆధ్వర్యంలో పిఏసిఎస్ వద్ద రిలే నిరాహార దీక్షకు సిఐటియు సభ్యులు ముసునూరు సహకార ఉద్యోగులకు సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్బంగా పలువురు నాయకులు మాట్లాడుతూ జీవో నెంబర్ 36 ను వెంటనే అమలు చేసి వేతన సవరణ చేయాలని మధ్యంతర భృతి చెల్లించాలని, వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని , గ్రాద్యుటి 2 లక్షల నుంచి 5 లక్షలకు పెంచాలని , 2019 తర్వాత జాయిన్ అయిన సహకర ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని అన్నారు., హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని చేసి, 20 లక్షల ఇన్సూరెన్స్ పాలసీని ప్రతి ఉద్యోగి కుటుంబానికి వర్తింపజేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్. రాష్ట్ర వ్యవసాయ రైతు సహకార నాయకులు సిఐటియు నాయకులు ఉద్యోగుల జేఏసీ, నాయకు లు ముసునూరు మండల ఉద్యోగ సంఘ నాయకులు మరియు సహకార సంఘాల సీఈవో లు దాసిరెడ్డి లక్ష్మణ కుమార్ పసుపులేటి దుర్గారావు కొండపల్లి ప్రసాద్ పల్లగాని వెంకటేశ్వరరావు అల్లూరు జానకిరాము కే స్వాతి వీరమాచనేని శ్రీనివాసరావు మరియు కోఆపరేటివ్ ఎంప్లాయి యూనియన్ జిల్లా కార్యదర్శి నీలం శ్రీనివాస్ రావు బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అక్కినేని రాజా పాల్గొన్నారు



## భవిత స్కూల్ లో ఫ్యాన్ అందజేసిన బియ్యం, కిరాణా వర్తక సంఘం ప్రెసిడెంట్ పేరూరి నరసింహారావు



**జగ్గయ్యపేట ఫిబ్రవరి 24 మనం న్యూస్ :** జగ్గయ్యపేట పట్టణం లోని సీతారామాపురం లోని భవిత స్కూల్ నందు పట్టణానికి చెందిన ఎల్ ఐ సి ఏజెంట్ రాయపూడి రమేష్ నాగలక్ష్మి ల పెళ్లి రోజు సందర్భశీ గా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో భవిత స్కూల్ యాజమాన్యానికి ఫ్యాన్ ను అందజేసారు. ఈ కార్యక్రమం లో ఐ వి ఎఫ్ ప్రతినిధలు పేరూరి వెంకట లక్ష్మి నరసింహారావు, పెనుగొండ రామకృష్ణ, మారం శ్రీనివాస రరావు, శ్రీ వాసవి సేవా సమితి జిల్లా ప్రెసిడెంట్ గెల్లా పూర్ణ చంద్రరరావు, ఎస్ కృష్ణా రావు, కె. రవి కుమార్, చౌట రమేష్ శ్రీ వాసవి సేవా సమితి మహిళా విభాగం గౌరవ సలహాదారులు గెల్లా సుభాషిణి తదితరలు పాల్గో న్నారు.

## దుర్గా మల్లేశ్వర స్వామి వార్షికోత్సవ వేడుకలలో పాల్గొన్న తన్నీరు నాగేశ్వరరావు

**జగ్గయ్యపేట ఫిబ్రవరి 24 మనం న్యూస్ :** జగ్గయ్యపేట పట్టణం 11 వార్డు దుర్గాపురం నందు శ్రీ దుర్గా మల్లేశ్వరి స్వామి వారి 32 వ వార్షికోత్సవ కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పాల్గొని అమ్మవారి నీ దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ ఫిరోజ్ ఖాన్, పట్టణ యువజన విభాగ అధ్యక్షులు రామిని ఉపేందర్ రెడ్డి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఏపీ స్టేట్ లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్. లో ప్రతిభ చాటిన జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)



**జగ్గయ్యపేట ఫిబ్రవరి 24 మనం న్యూస్ :** విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన ఏపీ స్టేట్ లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్ 2026లో జరిగిన రన్నింగ్ రేసులో జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ద్వితీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా సహచర ఎమ్మెల్యేలు ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. దృఢసంకల్పం, క్రమశిక్షణ ఉంటే ఏ వయస్సులోనైనా విజయం సాధించవచ్చని ఎమ్మెల్యే రాజగోపాల్ మరోసారి నిరూపించారు. బిబిప్రజాసేవలోనే కాక క్రీడారంగంలోనూ తన ప్రతిభను చాటుతూ అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య విజయంతో జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలు ఆందోత్సాహాలను వ్యక్తం చేస్తున్నారు. మిగతా పోటీలలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

## శ్రీ కనకదుర్గమ్మ అన్నదాన పథకంకి విరాళం



**విజయవాడ ఇంద్రకీలాద్రి ఫిబ్రవరి 24 (మనం న్యూస్) :** ఇంద్రకీలాద్రి పై వేంచేసియున్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి సుంకర వెంకటేశ్వర రావు కుటుంబం తరపున విరాళం : =ం. 1,00,116/- అన్నదానం దాత పేరు: సుంకర వెంకటేశ్వర రావు మరియు కుటుంబ సభ్యులు చిరునామా: అగ్గి రాము వీధి, కొత్తపేట, విజయవాడ . అనంతరం ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి వేద ఆశీర్వచనం శేష వస్త్రం అమ్మవారి చిత్రపటం ప్రసాదాలు అందజేశారు

## అన్నా క్యాంటీన్ తనిఖీ చేసిన చైర్మెన్

**ఉయ్యూరు ఫిబ్రవరి 24 (మనం న్యూస్):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ప్రవేశ పెట్టిన ఉయ్యూరు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అన్నాక్యాంటీన్ ను ఈరోజు ఫుడ్ నాణ్యతను పరిశీలించిన అన్నాక్యాంటీన్ చైర్మన్ బూరెల రమణ, మున్సిపల్ కమీషనర్ రామారావు. ఫుడ్ క్వాలిటీ, క్వాంటిటీ గురించి ప్రజలు ను అడగగా బాగున్నాయని చెప్పారు. చైర్మన్ రమణ, కమీషనర్ సంతృప్తి వ్యక్తం చేసారు.



# విజయవాడ అభివృద్ధే మా లక్ష్యం" : నగర అభివృద్ధికి డిపిఆర్ సిద్ధం

## గ్రేటర్ విజయవాడ కాకముందే నగర సమస్యలు పరిష్కరిస్తాము

## డ్రైనేజ్, స్ట్రాంమ్ వాటర్, డ్రింకింగ్ వాటర్ వంటి మౌలిక సదుపాయాలపై సమగ్ర చర్యలు: ఎంపీ కేశినేని శివనాథ్




**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 24 (మనం న్యూస్) :** వి.ఎం.సి లో ఎంపీ కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో విజయవాడ నగర అభివృద్ధిపై సమావేశం.నగరంలో రాబోయే ఆర్.వో.బి, ఆర్.యు.బిల నిర్మాణానికి మున్సిపల్ సిబ్బందితో సమన్వయ సమావేశాలపై చర్చించారు ఎమ్మెల్యేలతో కలిసి విజయవాడకు భారీ గ్రాంట్లు రాబట్టేందుకు కృషి చేస్తామన్న ఎంపీ కేశినేని శివనాథ్.అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కలిసే ప్రాంతాల్లో మినీ ఎస్.టి.పి ల ఏర్పాటుకు ప్రణాళిక .సీఎం దృష్టికి ప్రాజెక్టులు తీసుకెళ్లి వేగంగా పూర్తి చేసే దిశగా చర్యలు నగర అభివృద్ధే లక్ష్యంగా... విజయవాడ నగరాన్ని భవిష్యత్‌లో ఆధునిక నగరంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నామని, ఇందుకోసం స్ట్రాంమ్ వాటర్ డ్రైన్ నిర్మాణం, డ్రింకింగ్ వాటర్ పనులతో పాటు నగర సుందరీకరణ కి సంబంధించిన డీటెయిల్డ్



ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్) తయారైందని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. గ్రేటర్ విజయవాడ కాకముందే నగరంలోని సమస్యలను ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్, సుజనా చౌదరిలతో కలిసి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ లో మంగళవారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) నగరాభివృద్ధిపై కమిషనర్ ధ్యానచంద్ర ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, కార్పొరేటర్ చంటి తదితరులు కూడా హాజరయ్యారు.

ఈ సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్ రానున్న వర్షాకాలం దృష్ట్యా, నగరంలో వర్షపు నీరు రోడ్డుపైన నిల్వ ఉండకుండా స్ట్రాంమ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు విజయవాడ నగర పాలక సంస్థ వారు తయారుచేసిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్) సమీక్షించారు.

అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం పంట కాలువ డ్రైన్ 2.5 మీటర్లు ఉండగా ప్రస్తుత డిపిఆర్ ప్రకారం 8 మీటర్లకు వెడల్పు పెంచడం వల్ల వర్షపు నీరు నగరంలో నిలవ ఉండకుండా ప్రవహించేటట్టు చర్యలు తీసుకున్నామన్నారు. నగరంలో ఇంకా ను వర్షపు నీటి డ్రైన్ ల నిర్మాణం ఎక్కడైతే అసంపూర్తిగా ఉన్నాయో వాటిని పూర్తి చేసేటట్టుగా, ముఖ్యంగా కొండ ప్రాంతాలలో వర్షపునీటి నిలువల సమస్య లేకుండా ఈ డ్రైన్లు నిర్మించే విధంగా డిపిఆర్ తయారు చేశామని అన్నారు.

అమరావతి ప్రాంతానికి అనుబంధంగా ఉన్న విజయవాడ నగర అభివృద్ధికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. గత సంవత్సరం నుంచే స్ట్రాంమ్ వాటర్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మంచినీటి సరఫరాకు సంబంధించి డీపీఆర్ (ఖా=) సిద్ధం చేయాలని సూచించినట్లు తెలిపారు. గత పాలక మండలి డిపిఆర్ సిద్ధం చేయటానికి కూడా సుముఖత వ్యక్తం చేయకపోవటంతో.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో డీపీఆర్ పూర్తి చేయించినట్లు తెలిపారు.

గతంలో ఎల్ అండ్ టీ సంస్థ చేపట్టిన డ్రైనేజ్ వ్యవస్థ, స్ట్రాంమ్ వాటర్ పనుల్లో ఉన్న లోపాలను గుర్తించామని, వాటిని సరిదిద్దుతూ ఎక్కడా సమస్యలు లేకుండా సమగ్ర డీపీఆర్ రూపొందిస్తున్నామని వివరించారు. నగరంలో నేషనల్ హైవేలో, పలు ప్రాంతాల్లో రాబోయే ఆర్.ఓ.బీలు (=ాదీలు), ఆర్.యూ.బీలు (=ఖదీలు) నిర్మాణానికి సంబంధించిన పనుల్లో రైల్వే, నేషనల్ హైవే, ఆర్ అండ్ బి , మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది సమన్వయం చేసుకునే దిశగా ప్రత్యేకంగా సమావేశం నిర్వహించే అంశంపై చర్చించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు నగరంలోని మూడు ప్రధాన కాలువలను అందంగా తీర్చిదిద్దే ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కాలువల్లో కలిసే ప్రాంతాల్లో మినీ ఎస్టీపీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో 51వ డివిజన్ అధ్యక్షులు కుంచం దుర్గారావు ,క్లస్టర్ ఇన్చార్జ్ దీటి ప్రభుదాస్, 49వ డివిజన్ ప్రధాన కార్యదర్శి దీపంగి మధు, టీడీపీ నాయకులు సరుగుపల్లి రమేష్, చీఫ్ ఇంజనీర్ (ఇంచార్జ్) పి.సత్యకుమారి, సూపర్ ఇండెంటింగ్ ఇంజనీర్ (వర్క్స్) వి.చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జె శ్రీనివాస్ ఏ శ్రీనివాసరెడ్డి జి సామ్రాజ్యం సురేఖ లతో పాటు ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# తమ్మినేని సీతారాం ని కలిసిన జగ్గయ్యపేట వైసిపి నేతలు



**జగ్గయ్యపేట ఫిబ్రవరి 24 మనం న్యూస్ :** జగ్గయ్యపేట పట్టణానికి విచ్చేసిన మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ను పట్టణ పార్టీ అధ్యక్షులు ఫిరోజ్ ఖాన్ ,వైసిపి నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం పట్టణానికి విచ్చేసిన మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం వారి సతీమణి శ్రీవాణి ల ను పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ ఫిరోజ్ ఖాన్ , పట్టణ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ హాఫీజున్నిసా , రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి నంబూరి రవి , వార్డ్ అధ్యక్షులు మన్నే అప్పారావు తదితరులు కలిసి ఆత్మీయ సత్కారం నిర్వహించారు.

## ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో-2026 సదస్సులో రాహుల్ గాంధీ తీరును నిరసిస్తూ బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో ర్యాలీ

విజయవాడ తూర్పు ఫిబ్రవరి 24 ( మనం న్యూస్): ఢిల్లీ ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో-2026 సదస్సులో రాహుల్ గాంధీ తీరును నిరసిస్తూ బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో ర్యాలీ చేసిన బిజెపి మహిళా మోర్చా. పుష్ప హోటల్ నుంచి కొత్త వంతెన వరకు సాగిన ర్యాలీ చొక్కాలు విప్పి రభస చేసి అర్ధనగ్నంగా ప్రదర్శనలు చేసిన రాహుల్ గాంధీ తీరును తప్పుబట్టిన బిజెపి మహిళా నేతలు. బిజెపి నేత చిగురుపాటి లక్ష్మిఏఐ సదస్సుకు 100కు పైగా దేశాల ప్రతినిధులు మరియు 200 మంది గ్లోబల్ టెక్ దిగ్గజాలు హాజరయ్యారునీ సుమారు 80% దేశాలు భారతాూ× విధానాలకు మద్దతుగా ఢిల్లీ డిక్లరేషన్ మీద సంతకాలు చేశాయి. ప్రధానమంత్రి మోదీ దేశ సాంకేతిక శక్తిని ప్రపంచానికి చాటిచెబుతుంటే, రాహుల్ గాంధీ, వారి అనుచరులు అక్కడకు వచ్చి "అర్ధనగ్న ప్రదర్శన" చేయడం సిగ్గుచేటు ఇలాంటి చర్యలు దేశ ప్రతిష్టను దిగజారుస్తాయి యువత ఆశలను దెబ్బతీస్తాయి .దేశ గౌరవానికి భంగం కలిగించే ఇలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి ఉద్దేశపూర్వకంగా దేశాన్ని అవమానించే వారిని బహిష్కరించాలి. మోడీ సారధ్యంలో భారతదేశం సూపర్ పవర్ గా ఎదుగుతుంటే చూసి ఓర్వలేక పోతున్నారు . తల్లి పాలు తాగి రొమ్మును ఎట్లా అయితే గుద్దుతున్నారో, అదే విధంగా కాంగ్రెస్ పార్టీ చేస్తుంది. ఇటువంటి వారిని కఠినంగా శిక్షిస్తేనే... మరొకరు ఇలాంటి చర్యలకు పాల్పడరు.



# భక్తి వైభవం, వైదిక ఘనతలతో కుంభాభిషేకం





**విజయవాడ ఇంద్రకీలాద్రి ఫిబ్రవరి 24 ( మనం న్యూస్) :** శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో మార్చి 6 నుంచి 8వ తేదీ వరకు శాస్త్రోక్తంగా, అత్యంత వైభవంగా కుంభాభిషేక హోత్సవం జరగనుందని.. ఆగమ శాస్త్రం ప్రకారం 12 ఏళ్లకోసారి ఆలయంలోని దైవికశక్తి పునరుద్ధరణకు కుంభాభిషేకం మహోత్సవాన్ని నిర్వహించడం జరుగుతోందని, ఇందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు.

కుంభాభిషేక మహోత్సవం-2026 నిర్వహణపై ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఆలయ ఈవో వీకే శీనా నాయక్ తదితరులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ కంచి కామకోటి పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి చేతులమీదుగా కనకదుర్గమ్మ ప్రధాన ఆలయ శిఖర విమానగోపురానికి అభిమంత్రించిన అనేక పుష్కర మహా జీవ నదులు, సముద్రోదకములతో కుంభాభిషేకం జరుగుతుందని వివరించారు. మహోత్సవానికి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి హాజరవుతారన్నారు. వేద పండితుల ఆధ్వర్యంలో వైదిక క్రతువులు జరుగుతాయని.. దేశ విదేశాల నుంచి లక్షలాది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని, భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఇందుకు సమన్వయ శాఖల అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. దసరా ఉత్సవాలతో పాటు అనేక కార్యక్రమాలను చిన్న ఇబ్బంది కూడా లేకుండా విజయవంతంగా నిర్వహించడంలో జిల్లా అధికారులు, ఆలయ అధికారులు కృషిచేశారని.. ఇదేవిధంగా మున్ముందు కూడా కృషిచేయనున్నట్లు పేర్కొన్నారు.

### సామాన్య భక్తులకు పెద్దపీట

కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కుంభాభిషేకం హోత్సవాల సమయంలో సామాన్య భక్తులకు పెద్దపీట వేయనున్నామని.. మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని విధాలా సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. టీమ్ ఎన్టీఆర్ ఆధ్వర్యంలో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని, గౌరవ ప్రజాప్రతినిధులు, అధికారుల సమష్టి కృషితో ఆధ్యాత్మిక మహా కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని పేర్కొన్నారు. అత్యుత్తమ ప్రమాణాలతో ఏర్పాట్లు చేస్తున్నామని.. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. దసరా సమయంలో రోజుకి రెండు లక్షల మంది భక్తులు వచ్చినా ఇబ్బంది లేకుండా చూశామని.. ఇప్పుడు రోజుకు మూడు లక్షల మంది వచ్చినా ఇబ్బంది లేకుండా పూర్తి సన్నద్ధతతో రాజీలేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

### భక్తుల భద్రతకు భరోసా: సీపీ ఎస్వీ రాజశేఖరబాబు

భక్తుల భద్రతకు భరోసా కల్పిస్తూ పటిష్ట బందోబస్తుకు ఏర్పాట్లు చేస్తున్నామని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు. ఏటా అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తోందని.. కుంభాభిషేక మహోత్సవానికి కూడా లక్షలాదిమంది భక్తుల హాజరవుతారని అంచనా వేస్తున్నామని.. ఇందుకు తగ్గట్లు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసు శాఖ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

లిఆలయ ప్రధాన అర్చకులు లింగంభొట్ల దుర్గాప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు షణ్ముకశాస్త్రి కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమాల గురించి వివరించారు. భారతదేశంలోని పుణ్య నదులు, తీర్థాలు, సప్త సముద్రాల జలాలను కలశాలలో ఉంచి, యాగశాలలో మంత్రయుక్తంగా పూజించిన తర్వాత వైదికంగా చేసే అభిషేకమే కుంభాభిషేకమని వివరించారు. మార్చి 6న యాగశాలలో ఉదయం 8 గంటల నుండి యాగశాల ప్రవేశం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, పంచగవ్యప్రాశనం, అఖండ దీపారాధన, మధ్యాహ్నం 12 గంటలకు అంకురార్పణ. సాయంత్రం 4 గంటల నుండి అగ్నిప్రతిష్ఠాపన, మూల మంత్ర హవనములు, హారతి, రాత్రి 7 గంటలకు మంత్రపుష్పము ఉంటుందన్నారు. అదేవిధంగా ఏడో తేదీన యాగశాలలో ఉదయం 8 గంటల నుండి వివిధ పవిత్ర నదీ, సముద్ర జలాలతో అష్టోత్తర కలశస్థాపన, పూజ, పీఠ పూజలు, మధ్యాహ్నం 12 గంటలకు మూలమంత్ర హవనములు. సాయంత్రం 4 గంటల నుండి మూలమంత్రహవనములు, ప్రదోషకాల పీఠపూజలు, హారతి, రాత్రి 7 గంటలకు మంత్రపుష్పము ఉంటుందని వివరించారు.

8వ తేదీన యాగశాలలో ఉదయం 7 గంటల నుండి మంటప పూజలు, మూలమంత్ర హవనములు, ఉదయం 9 గంటలకు పూర్ణాహుతి. ఉదయం 9:34 నిమిషములకు మేషలగ్నంలో శ్రీ కనకదుర్గ అమ్మవారి ప్రధాన ఆలయ ప్రాంగణంలో కుంభాభిషేకం జరుగుతుందని తెలిపారు. కుంభాభిషేకం అనంతరం రాజగోపురం ప్రాంగణంలో కళావేదికపై శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి వారి అనుగ్రహ భాషణం ఉంటుందని తెలిపారు.